సాక్షి ఒడిశా

శుక్రవారం । 12 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.2,23,593
బంగారం	80 మిల్లీ గ్రాములు
వెండి	31 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



డయేరియా కలకలం

మల్కన్‌గిరి జిల్లాలోని మత్తిలి సమితి కర్తన్‌పల్లి పంచాయతీ కోప్రా గ్రామంలో కలుషిత నీరుతాగి 12 మంది డయేరియా బారినపడ్డారు.

- 8లో



రైలు ప్రమాదంలో ఏఎల్‌పీ దుర్మరణం

తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ రైలు మండలంలో లోకో పైలట్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ కుమార్ సింగ్ దుర్మరణం పాలయ్యాడు.

- 8లో

న్యూస్‌రీల్

గుండెపోటుతో ఏడీఎం బీరేంద్ర కుమార్ మృతి



బీరేంద్ర కుమార్ దాస్ (ఫైల్)

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఏడీఎం (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్ గురువారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం రాత్రి బీఎన్ ప్యాలెస్‌లో ఒక సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని స్టేజీపై పాటపాడుతూ గుండెపోటుతో పడిపోయారు. అనంతరం ఆయనను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అనంతరం అక్కడ నుంచి బరంపురం మెడికల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. బీరేంద్ర కుమార్ దాస్ స్వగ్రామం భద్రక్ పట్టణం. గత రెండేళ్లగా గజపతి కలెక్టరేట్‌లో రెవెన్యూ ఏడీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మరణవార్త తెలుసుకున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి కుమార్‌లు ఆస్పత్రికి వెళ్లి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

జయపురం: స్థానిక విద్యాన్ కళాశాల ముంగిట గురువారం ఉదయం ఒక గుర్తు తెలియని వృద్ధుడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ కనిపించాడు. అతడిని చూచిన వారు వెంటనే ఆ వృద్ధుడిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్చారు. అయితే చికిత్స పొందుతూ వృద్ధుడు మరణించాడు. ఆ వృద్ధుడు ఎవరో, అతడి పేరు ఏమిటో, ఎక్కడ నుంచి వచ్చాడో వివరాలు తెలియడం లేదని హాస్పిటల్ వర్గాలు వెల్లడించారు. జయపురం పట్టణ పోలీసులు హాస్పిటల్‌కు చేరి మృతిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నియమాల మేరకు వృద్ధుని మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహిస్తామని పోలీసులు వెల్లడించారు.

గొలుసు దొంగతనం కేసులో ఒకరు అరెస్టు



బాధితురాలు అనసూయ

రాయగడ: స్థానిక గుండిచా మందిరానికి సమీపంలో బి.అనసూయ అనే వృద్ధ మహిళ మెడలో గొలుసు దొంగతనం కేసుకు సంబంధించి పోలీసులు బుధవారం సాయంత్రం ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి స్థానిక నది వీధికి చెందిన శ్రీను పలకగా గుర్తించారు. నిందితుడి నుంచి ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 3వ తేదీన గుండిచా మందిరానికి సమీపంలోని తన ఇంటి వద్దనున్న చిన్న దుకాణాన్ని తెల్లవారుజామున తెరిచిన సమయంలో, గుర్తు తెలియని ఇద్దరు దుండగులు గుట్కాలు కొనేందుకు వచ్చామని ఆమెను అడిగారు. ఆమె గుట్కాలు ఇస్తున్న సమయంలో మెడలోని 4 తులాల బంగారు గొలుసుతో పాటు మరో వెండి గొలుసును తెంచుకొని పరారయ్యారు. ఈ మేరకు ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టి, శ్రీను అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసుకు సంబంధించి మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలియజేశారు. అతడిని కూడా పట్టుకుంటామని వెల్లడించారు.

గంజాయితో ఒకరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన రమేష్‌ను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఒక యువకుడిని ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. అతని నుంచి 9.425 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కోర్టుకు గురువారం తరలించారు. ఎక్సైజ్ ఐఐసీ సంజయ్ కుమార్ ప్రధాన్ తెలియజేసిన వివరాల ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా సమాచారంతో స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒక బస్సులో కూర్చున్న వ్యక్తిని అనుమానించి తనిఖీ చేయగా, అతని బ్యాగులో గంజాయి పట్టుబడింది. నిందితుడు హర్యానాకు చెందిన రమేష్‌గా గుర్తించారు. దీంతో అతడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఏఎస్ఐ రాసి నాయక్, కానిస్టేబుల్ మెలక కుమారి, జి.ధర్మారావు, అమర్ దలాయ్, కిషోర్ బిడిక, సందీప్ పాత్రోలు దాడులు చేపట్టారు.



డిప్యూటీ సీఎం, మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మనోజ్ తదితరులు

- సక్రమంగా విధులు నిర్వహించాలి
- డిప్యూటీ సీఎం ప్రభాతి పారిడా
- సమీక్ష సమావేశంలో అధికారులకు ఆదేశం



డిప్యూటీ సీఎం పారిడాను సన్మానిస్తున్న కలెక్టర్ మహాజన్

ప్రజల కోసం పనిచేయండి

రాయగడ: రాష్ట్రంలోని అధికారులు ప్రజల కోసం పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పారిడా ఆదేశించారు. జిల్లాలోని కాసీపూర్‌లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాసీపూర్ సమితి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు తమ తమ శాఖల్లో సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటక, వాణిజ్య, రవాణా, మాతా శిశు సంరక్షణ, మిషన్ శక్తి వంటి రంగాలపై ఆమె సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతీ పథకం ప్రజల వద్దకు చేరాలంటే ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

ఖనిజ సంపద సద్వినియోగం

రాష్ట్రంలో ఖనిజ, ప్రాకృతిక సంపదలకు ఏమాత్రం కొదవ లేదని, ముఖ్యంగా కాసీపూర్‌లోని ఖనిజ సంపదను సద్వినియోగపరుచుకుంటే రాష్ట్రంలోనే రాయగడ జిల్లా అభివృద్ధి దిశలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. అయితే కాసీపూర్‌ను ప్రతీ ఏడాది అనారోగాలు, అతిసార వ్యాధులు పట్టిపీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఆర్థిక, సామాజిక రంగాల్లో పురోగతి సాధించాలంటే అందుకు అభివృద్ధి ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. ఉన్న ఖనిజ సంపదలను సద్వినియోగపరుచుకుంటే కొత్త కొత్త పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. అయితే ప్రజల్లో అవగాహన కరువవ్వడంతో ఖనిజ సంపదల వినియోగానికి అడుగడుగునా అవాంతరాలు ఏర్పడుతున్నాయన్నారు.

పర్యాటక రంగానికి పెద్దపీట

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి కొత్త ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభాతి పారిడా అన్నారు. ప్రకృతి అందాలకు నెలవుగా ఉన్న రాయగడ జిల్లాను పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పర్యాటక రంగాలకు సంబంధించి పూర్తి వివరాలను తెలియజేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి భగవాన్‌ను కోరారు. దీంతో జిల్లాలో ఎన్నో పర్యాటక స్థలాలు ఉన్నాయని ముఖ్యంగా చాటికొన జలపాతం, గదగదియా జలపాతం, టికిరిలో కొన్ని జలపాతాలు ఉన్నాయని వివరించారు. అయితే వాటికి సరైన ఆదరణ లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన ఆమె త్వరలో పూర్తిగా సమీక్షించి కార్యాలయ భవనం ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామన్నారు.

మాతా, శిశు సంక్షేమానికి ప్రాధాన్యత

రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం మాతా, శిశు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించేందుకు సన్నాహాలు చేస్తోందని వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు వివరించారు. పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం అందివ్వడంలో ఎటువంటి అవకతవకలు చేయకూడదని, అంగన్‌వాడీ కార్యకర్తలు చిత్తశుద్ధితో తమ విధులను నిర్వహించాలని సూచించారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

పర్యావరణ పరిరక్షణకు 'మా పాయి గొచ్ఛొటియే'

పర్యావరణ సమతుల్యానికి రాష్ట్ర ప్రభుత్వం మా పాయి గొఛ్ఛొటియే కార్యక్రమాన్ని అమలు చేసిందని పారిడ అన్నారు. ఈ జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా ఇంతవరకు ఎన్ని మొక్కలు నాటారని సంబంధిత శాఖ అధికారిని ప్రశ్నించారు. ఇప్పటివరకు జిల్లాలో 1.30 లక్షల మొక్కలను నాటామని తెలియజేశారు. మొక్కలు నాటి చేతులు దులుపుకుంటే కాదని, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు.

మహిళల ఆర్థిక ప్రగతికి కృషి

రాష్ట్రంలోని మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో పురోగతి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు వారు చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక సమీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పుట్టగొడుగు, కోళ్ల పెంపకం, చేపల పెంపకం వంటి రంగాల్లో వారికి తగిన ప్రోత్సాహం అందజేయాలన్నారు. రాష్ట్రంలో కనీసం 3 లక్షల మంది మహిళలను లక్షాధికారులు చేసేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై శ్రద్ధ

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఖనిజ శాఖల మంత్రి బిభూతి జెన్న అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని మైనింగ్ టెండర్ల విషయంలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు. కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కాసీపూర్ సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి, కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరొ, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ రద్దు

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం మొదటిసారిగా ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పారిడ, మంత్రి బిభూతి భూషన్ జెన్న, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌లు కాసీపూర్‌లో పర్యటించారు. సమీక్ష సమావేశం అనంతరం జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయితే వాతావరణం అనుకూలించలేదని సమీక్ష సమావేశం అనంతరం ఉపముఖ్యమంత్రి పారిడా, మంత్రి బిభూతి, ప్రవుల్ల సామల్‌లు తిరిగి వెళ్లిపోవడంతో బహిరంగ సభ రద్దయ్యింది. ఎంతగానో ఎదురుచూసిన సభ రద్దవ్వడంతో ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. అదేవిధంగా ఆ పార్టీ కార్యకర్తలు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా అంతకుముందు కాసీపూర్‌లో నూతనంగా నిర్మించిన గోవర్ధన మందిరాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పారిడా ప్రారంభించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. టికిరిలోని మైత్రీ అనే ప్రైవేట్ సంస్థ అధినేత ఎం.శ్రీనివాస్‌రావు ఈ మందిరాన్ని అతను సొంత ఖర్చులతో నిర్మించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు

కాసీపూర్, బిసంకటక్, కల్యాణ సింగుపూర్ వంటి సమితుల్లో అత్యధిక శాతం పండ్ల తోటల పెంపకాలతో ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని ఆమె తెలిపారు. అయితే వారు పండించిన పంటలకు సంబంధించి సరైన గిట్టుబాటు ధరలు లభించకపోయినా తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయా ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయగలిగితే రైతులు ఆర్థిక పురోగతి చెందుతారన్నారు. కాసీపూర్‌లో పండించే మామిడి పండ్లు ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతులు అవుతున్న సంగతి తమ దృష్టికి వచ్చిందన్నారు.

యువతి మృతదేహం లభ్యం



సంధ్య మృతదేహం



సంధ్య(ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి కేంద్రానికి చెందిన సంధ్య నాయిక్ అనే యువతి మృతదేహం జలాశయంలో గురువారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ సమితి దుర్గగుడి వెనుక భాగంలో ఉన్న జలాశయానికి సోన నాయిక్ కుమార్తె సంధ్య నాయిక్ (23) బుధవారం మధ్యాహ్నం స్నానానికి వెళ్లింది. అయితే సాయంత్రం అయినా కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలించారు. జలాశయం వద్దకు వెళ్లి చూడగా గట్టుపై సబ్బు, టవల్, చెప్పులు, ఇతర దుస్తులు ఉండడంతో నీటిలో మునిగిపోయి ఉంటుందని గ్రహించి జలాశయంలో వెతికారు. కానీ చీకటి పడిపోవడంతో ఆచూకీ లభించలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు గురువారం ఉదయం 5 గంటలు నుంచి గాలించగా, మధ్యాహ్నం సమయానికి సంధ్య మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న చిత్రకొండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగిస్తామని చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్క తెలిపారు. విషయం తెలిసిన చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో తల్లిదండ్రులను పరామర్శించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి

మల్కన్‌గిరి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి అన్నారు. జిల్లాలోని కలిమెల సమితి టిగాల్ పంచాయతీ కార్యాలయం వద్ద యువతకు క్రీడా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యువత క్రీడల్లో సత్తాచాటి అంతర్జాతీయంగా ఎదగాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలో డెంగీ విజృంభణ

- 488 కేసులు ధ్రువీకరణ



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో డెంగీ విజృంభణ ఆందోళన కలిగిస్తోంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో రాష్ట్రంలో డెంగీ తీవ్రత అధికమైంది. ఈ పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన ఆరోగ్య శాఖ ఇతర అనుబంధ శాఖల కార్యదర్శులతో గురువారం సమావేశం అయ్యారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 488 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా వివరాలు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 35,470 డెంగీ నమూనా పరీక్షలు జరిగాయి. ఖుర్దాలో అత్యధికంగా 130 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. తాజాగా 33 పాజిటివ్ కేసులను ఆరోగ్య శాఖ గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి అధ్యక్షతన శాఖల కార్యదర్శుల సమక్షంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అన్ని విభాగాలను అప్రమత్తం చేసి దోమల సంతతి వృద్ధిని అరికట్టేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పిల్లలను అప్రమత్తం చేసి రోగాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలని కోరారు. హాస్టల్‌లో దోమ తెరలు వాడాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పింఛన్ల నిలుపుదలపై పోలీసులకు ఫిర్యాదు



పోలీసు అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న హరిరావు

జయపురం: రణస్పూర్ పంచాయతీలో బతికి ఉన్నవారిని మరణించినట్లు రికార్డుల్లో చూపించి, వారి పెన్షన్లు నిలుపుదల చేసినవారిపై సామాజిక కార్యకర్త బి.హరిరావు, బాధితులు బిసింగపూర్ పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పంచాయతీ సర్పంచ్, గ్రామ పంచాయతీ విస్తరణ అధికారులను ప్రతివాదులుగా చేర్చారు. గ్రామానికి చెందిన చైతన్ హరిజన్, చంద్రమా హరిజన్, రమా హరిజన్‌లు మరణించినట్లు చూపి, వారికి రావాల్సిన పెన్షన్ డబ్బులు స్వాహా చేశారని ఆరోపించారు. 2023 సెప్టెంబర్‌లో ముగ్గురు లబ్ధిదారుల ఆధార్ కార్డులు, బ్యాంక్ పాస్ బుక్‌లు పంచాయతీ కార్యాలయంలో దాఖలు చేశారని, అయితే చనిపోయారని పెన్షన్ నిలుపుదల చేసినా, రేషన్ బియ్యం ఎలా వస్తోందని ప్రశ్నించారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

పిడుగుపాటుకు భార్యాభర్తల దుర్మరణం



రబి ముదిలి మృతదేహం



బొడి ముదులి మృతదేహం

జయపురం: పిడుగు పడి భార్యాభర్తలు దుర్మరణం చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ సమితి పరలా గ్రామానికి చెందిన రబి ముదులి(29), అతడి భార్య బొడి ముదులి(28)లు డొంగర ప్రాంతంలో పోడు వ్యవసాయ భూమికి వెళ్లి చోడి(రాగులు) నారు నాటుతున్నారు. అయితే సాయంత్రం 4.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం ప్రారంభమయింది. దీంతో వారిరువురు ఒక చెట్టు కింద తలదాచుకున్నారు. అదే సమయంలో ఆ చెట్టుపై పిడుగు పడడంతో వారు అక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. రాత్రి అయిపోయినా పొలానికి వెళ్లిన రబి, బొడిలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారిని వెదుకుతూ పొలం వద్దకు వెళ్లారు. పొలం సమీప ఒక చెట్టు కింద అచేతనంగా పడివున్న వారిని చూసి వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిని పరీక్షించిన డాక్టర్లు బొడి ముదులి అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. రబి ముదులి పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని వెంటనే జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ రబి సైతం మరణించాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గజపతిలో మహిళా కమిషన్ కోర్టు



కేసులు విచారిస్తున్న మహిళా కమిషన్ సభ్యులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టరేట్‌లో ఒడిశా రాష్ట్ర మహిళా కమిషన్ క్యాంపు కోర్టు జరిగింది. జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న మహిళల కేసులను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మినాతి బెహరా విచారించారు. ఆమెతో పాటు మహిళా కమిషన్ సభ్యురాలు సుజాత దిగల్, లా ఆఫీసర్ అరవింద పట్నాయిక్‌లు ఉన్నారు. మొత్తం మహిళా కేసులు 17 కాగా, వారిలో 11 పార్టీలు కమిషన్ ఎదుట హాజరయ్యారు. వాటిలో 1 కేసు పరిష్కారం కాగా, ఒక కేసు డ్రాప్ అయ్యింది. మరో 3 కేసులు జిల్లా ఎస్పీకి రిఫర్ చేశారు. మూడు కేసులకు రక్షణ కల్పించేందుకు అంగీకరించారు. మరో మూడు కేసుల కక్షిదారులు హాజరుకాకపోవడంతో తిరిగి నోటీసులు పంపించారు.

క్లుప్తంగా

రైలు ప్రమాదంలో ఏఎల్‌పీ దుర్మరణం



భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ రైలు మండలంలో లోకో పైలట్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ కుమార్ సింగ్(28) దుర్మరణం పాలయ్యాడు. ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్ దక్షిణ మార్షలింగ్ యార్డ్ సంతోషిమాత ఆలయం ఎదురుగా రైల్వే ట్రాక్‌పై దుర్ఘటనకు గురై ప్రాణాలు కోల్పోయినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. ఆయన స్వస్థలం బీహారు రాష్ట్రం సరన్ జిల్లా దేహుడి గ్రామం. 8 ఏళ్లుగా భారతీయ రైల్వే సహాయ లోకో పైలట్ ఖుర్దారోడ్ మండల్‌లో పని చేస్తున్నాడు. ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) అధికారి అభిమన్యు సెఠి విచారణ జరిపి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, స్థానిక మండల రైల్వే ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. పంచనామా ముగించి కుటుంబీకులకు మృతదేహం అప్పగించడం జరుగుతుందన్నారు. విషయం తెలియడంతో స్థానిక తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు సహాయ సమన్వయకర్త నిరంజన్ మిశ్రా, శాఖా కార్యదర్శి లక్ష్మీధర మహంతి ఆధ్వర్యంలో కార్మిక నాయకుల బృందం ఘటనా స్థలం సందర్శించింది. దైనందిన కార్యకలాపాల పర్యవేక్షణ పురస్కరించుకుని లాబీ కార్యాలయానికి వెళ్తుండగా దుర్ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. నిబంధనల మేరకు ఆయన కుటుంబానికి అందజేయాల్సిన కారుణ్య పరిహారం, ఇతరేతర బకాయిలను సకాలంలో విడుదల చేసి ఆదుకోవాలని ఈ బృందం రైల్వే అధికార యంత్రాంగానికి అభ్యర్థించింది.

బీరేంద్ర కుమార్ మృతికి సంతాపం



సంతాప సభలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్ నిన్న రాత్రి ఆకస్మిక మృతికి స్థానిక యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో గురువారం సాయంత్రం సంతాప సభను జరిగింది. ఈ సందర్భంగా ఆయన మృతికి 5 నిమిషాల మౌనం పాటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో స్మృతి రంజన్ ప్రధాన్, డీఎఫ్‌వో ఎస్. ఆనంద్, ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఎస్పీ సునీల్ కుమార్ మహంతి, డీఆర్‌డీఏ అదనపు కార్యనిర్వాహణ అధికారి పృధ్వీరాజ్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసేందుకు గడువు పెంచినట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శ్రీకాకుళం 80 ఫీట్ రోడ్‌లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు ఈనెల 21 వ తేదీ నుంచి గిరిజన భవన్ లో (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, శ్రీకాకుళం వెనుక) ప్రారంభిస్తామని, వివరాలకు 7382975679, 9295653489, 8332852106 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముగ్గు సందేశం



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగవల్లిక ఏర్పాటు చేశారు. జనాభా పెరుగుదల అంత మంచిది కాదని సందేశమిచ్చారు. – సారవకోట

ఆదిత్యుని సన్నిధిలో శ్రీరామానంద భారతి స్వామీజీ



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం శ్రీమౌనానంద తపోవనం శ్రీ సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి శ్రీరామానంద భారతి స్వామీజీ గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌లు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రత్యేక గోత్రనామాల అర్చనల తర్వాత వేదాశీర్వచనాన్ని అందజేశారు.

డయేరియా కలకలం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామస్తులు



ఆరోగ్య కేంద్రం వద్ద చికిత్స పొందుతున్న మహిళలు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాంగు ఖీలో



రోగులతో మాట్లాడుతున్న చిత్రకొండ ఎమ్మెల్యే మాంగు ఖీలో

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి కర్తన్‌పల్లి పంచాయతీ కోప్రా గ్రామంలో కలుషిత నీరుతాగి 12 మంది డయేరియా బారినపడ్డారు. గురువారం ఉదయం నాటికి వారంతా వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి చికిత్స అందజేశారు. వారిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉందని, వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆరోగ్య కేంద్ర వైద్యుడు అమాయ్ స్వాయి తెలిపారు. అలానే నలుగురు వైద్యుల బృందాన్ని గ్రామానికి పంపించి అక్కడ వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. చికిత్స పొందుతున్నవారిలో కమల్ లోచాన్ సమార్థ్, మోతిసింగ్ దొర, హరి పూజారి, ముకుందో డోరా, లలిత పూజారి, సధన్ సమార్థ్, కమాలా పూజారి, శుక్ర సమార్థ్, కమల దొర, దేవనాంద్ పూజారి, ఖాంగ్ దొర ఉన్నారు. విషయం తెలియడంతో చిత్రకొండ ఎమ్మెల్యే మాంగు ఖీలో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రోగులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి సరైన వైద్యం అందజేయాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో హీరా పంచమి



పర్లాకిమిడి: గుండిచా మందిరం వద్ద దీపారాధన



పర్లాకిమిడి: నృసింహా, వరాహ అవతారంలో శ్రీజగన్నాథ, బలరాములు



రాయగడ: నృసింహావతారంలో జగన్నాథుడు



రాయగడ: గుణుపూర్‌లో నృసింహ అవతారంలో జగన్నాథుడు



రాయగడ: కల్యాణ సింగుపూర్‌లో జగన్నాథుడి దర్శనం



రాయగడ: గుండిచా మందిరంలో భక్తుల సందడి

రాయగడ: హీరా పంచమి సందర్భంగా గుండిచా మందిరంలో కొలువైయున్న శ్రీజగన్నాథుడికి గురువారం ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. స్వామివారు నృసింహ అవతారంలో దర్శనమిచ్చారు.

– పర్లాకిమిడిలో...

హీరా పంచమి సందర్భంగా స్థానిక గుండిచా మందిరంలో మహిళలు పానకాలను జగన్నాథ స్వామివారికి సమర్పించారు. పురాణాల ప్రకారం హీరా పంచమి నాడు లక్ష్మీదేవి శ్రీమందిరం నుంచి గుండిచాకు విచ్చేసి కోపంతో జగన్నాథ రథాన్ని తన్నుతుంది. ఈ ఘట్టాన్ని మందిరంలో సేవాయత్‌లు ఘనంగా నిర్వహించారు. గుండిచా మందిరం వెలుపల ఆనంద బజార్‌లో ఈరోజు 3 వేల మంది అన్న ప్రసాదాలను స్వీకరించినట్లు రథయాత్ర కమిటీ తెలియజేసింది. ఈరోజు యథావిధిగా శ్రీజగన్నాథుడు వరాహ, నృసింహ అవతారాల్లోనే భక్తులకు దర్శనమిచ్చారు.

స్మార్ట్ పార్క్‌ల ప్రారంభం



పార్క్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొమాంగో తదితరులు

రాయగడ: పిల్లలకు వినోదాన్ని అందేందుకు గుణుపూర్ మున్సిపాలిటీ నిర్మించిన రెండు స్మార్ట్ పార్క్‌లను ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో గురువారం ప్రారంభించారు. పాత గుణుపూర్‌లోని కొండబవురి వీధిలో సుమారు రూ.19 లక్షల వ్యయంతో వీవీకే దేవ్ పేరిట నిర్మించిన స్మార్ట్ పార్క్‌తో పాటు, సుమారు రూ.కోటితో కోవిడ్ సమయంలో నిర్మితమైన పార్క్‌కు అదనంగా మరో రూ.15 లక్షలతో నవీకరించారు. దీనిని కూడా ఎమ్మెల్యే గొమాంగో ప్రారభించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మమత గౌడో, వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడో తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అధికారులతో చర్చలు



అధికారులతో చర్చిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ బడ్జెట్ అంశాలపై ప్రముఖ కార్యదర్శి, అభివృద్ధి కమిషనర్, ఆర్థిక శాఖ కార్యదర్శి మరియు ఇతర సీనియర్ అధికారులతో గురువారం ప్రత్యేకంగా చర్చించారు. ఆర్థిక శాఖ ప్రస్తుతం ముఖ్యమంత్రి అధీనంలో ఉంది. ఈ నెల 25న ఆయన శాసన సభలో రాష్ట్ర బడ్జెట్ 2024–25ను ప్రవేశపెట్టాల్సి ఉంది.



• వానలు కురవాలి దేవుడా..

వానలు కురవాలని, పంటలు పండాలని కోరుతూ పెద్దపద్మాపురం, జోదూరు గ్రామాల్లో గ్రామ దేవతలకు గురువారం పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ముర్రాటలతో జోదూరు గ్రామంలో చల్లదనం చేశారు. పెద్దపద్మాపురం గ్రామ ప్రజలంతా కలసి తోటలో వెలసిన గాంధమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. – మెళియాపుట్టి

పాతపట్నం సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పాతపట్నం సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్

పాతపట్నం: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. పాతపట్నం సీహెచ్‌సీని గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రోగుల వార్డులు, ప్రసూత వార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ ప్లాంట్ పనితీరు, డయారియా కేసుల వివరాలు, రోగులకు అందుతున్న సేవలను, ఓపీ, ఇన్ పేషెంట్ వివరాలను వైద్యురాలు అనితను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగదులు, వంట పాత్రలను పరిశీలించారు. భోజనాన్ని రుచి చూశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి తెలియజేశారు. ఆయనతో తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ రామ్, ఏపీఓ సురేష్, ఏపీఎం మణిరత్నం, ఎంఈఓలు శ్రీధర్, తిరుమలరావులు, ఆర్ఐ భువన్‌కుమార్, ఈఓపీఆర్డీ కృష్ణా రావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ తుది విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో పాలీసెట్–2024 వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన గురువారం ప్రారంభమైంది. మొదటి విడత పాలీసెట్‌లో ర్యాంకు వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల కౌన్సెలింగ్‌కు హాజరవుతున్నారు. గురువారం నుంచి శనివారం వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. మొదటి రోజు 35 మంది హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించి విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాంఇల్సి ఉంటుంది. ఆప్షన్ల నమోదు ఈ నెల 14వ తేదీలోపు చేసుకోవాల్సి ఉంటుంది. 16వ తేదీన సీట్లు అలాట్ చేస్తారు. 18 నుంచి 20వ తేదీ మధ్య సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మొదటి విడతలో సీట్లు వచ్చిన విద్యార్థులు సైతం రెండో విడతలో కళాశాలలు, బ్రాంచ్‌లు మార్చుకునే అవకాశం లభిస్తుంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలు 10 ఉండగా, 2674 సీట్లు ఉన్నాయి. 1427 ప్రవేశాలు జరిగాయి. 1247 సీట్లు ఖాళీలు ఉన్నాయి. కౌన్సెలింగ్ ప్రక్రియను పిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

బండిగుడ ప్రజల కల నెరవేరింది



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపు భొత్ర

• కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూప భొత్ర

జయపురం: పంచాయతీ కార్యాలయం ఏర్పాటుతో బొరిగుమ్మ సమితి బండిగుడ ప్రాంత ప్రజల చిరకాల కల నెరవేరిందని కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూప భొత్ర అన్నారు. గ్రామంలో నూతన పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిజాపూర్ గ్రామ పంచాయతీ నుంచి బండిగుడను వేరుచేసి పంచాయతీగా ప్రకటించినా, పంచాయతీ కార్యాలయం లేకపోవడంతో బిజాపూర్ పంచాయతీ కార్యాలయానికే ఈ ప్రాంత ప్రజలు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కాగా ఇప్పుడు ప్రత్యేక కార్యాలయం ఏర్పడడంతో ప్రజల ఇబ్బందులు తప్పాయని పేర్కొన్నారు. ఇక నుంచి ఈ ప్రాంత ప్రజలు ఇక్కడే అన్ని సేవలు పొందుతారని తెలిపారు. కార్యాలయంలో మీటింగ్ హాల్, చుట్టూ ప్రహరీ త్వరలోనే నిర్మించడం జరుగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యాలయాన్ని రూ.35 లక్షల వ్యయంతో నిర్మించామని జూనియర్ ఇంజినీర్ సత్యనారాయణ సెట్టి వెల్లడించారు. సర్పంచ్ గణేశ్వర నాయిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బొరిగుమ్మ బీడీవో సంధ్య సామరథ్, జిల్లా పరిషత్ సభ్యుడు సత్యప్రసాద్ బిడిక, ఇంజినీర్ ప్రకాశ్ ప్రధాన్, బైశాకు హరిజన్, అశోక్ గౌడ, బాబుల బెహర, కె.శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు జి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో మాక్‌డ్రిల్

గార: అక్రమ చొరబాట్లను నిరోధించేందుకు మెరైన్, సివిల్ పోలీస్, కోస్టుగార్డులు మాక్‌డ్రిల్ నిర్వహించారని కళింగపట్నం మెరైన్ సీఐ నారీమణి తెలిపారు. బుధ, గురువారాల్లో జిల్లా తీర ప్రాంతమంతటా గస్తీ నిర్వహించారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా గురువారం ముగ్గురు వ్యక్తులు డమ్మీ ఆర్డీఎక్స్‌తో ఆమదాలవలస రైలులో దిగి, రోడ్డు మార్గాన శ్రీకాకుళం రూరల్ మండలంలోని తండ్యాలపేట సమీపంలో ఉన్న జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వద్ద బైక్‌లపై వస్తుండగా పట్టుకుని అవగాహన కల్పించారు. ప్రజల్లో అవగాహన, యంత్రాంగం సమాయత్తం వంటి పరిస్థితులు అంచనా వేసేందుకు ఈ డ్రిల్ జరిగిందన్నారు. సాగర్ కవచ్ పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

'సరైన సమయంలో గర్భధారణతో తల్లికి మేలు'



చెక్కు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి

అరసవల్లి: సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు, బిడ్డకు మధ్య అంతరం తల్లీబిడ్డకు మంచిదని ఆ దిశగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, వైద్యం, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమన్నారు. జిల్లాలో కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్సలు అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. కుటుంబ నియంత్రణ, శస్త్రచికిత్సలు ప్రోత్సహించడంలో ఉత్తమ సేవలు అందించిన వారికి నగదు పారితోషకం ఉంటుందన్నారు. అనంతరం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స లబ్ధిదారునికి రూ.5వేలు చెక్కును మీనాక్షి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీదేవి, డీపీఎంఓ డాక్టర్ జీవీ లక్ష్మి, డాక్టర్ సుజాత, సమాజసేవకులు మంత్రి వెంకటస్వామి, రామనాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సూర్యకళ, విజయలక్ష్మి, మోహిని ఉన్నారు.

శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ మెరిట్ లిస్ట్ విడుదల



ఎస్ఎంపురం ఆర్‌జీయూకేటీ క్యాంపస్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ మెరిట్ లిస్టును గురువారం అధికారులు విడుదల చేశారు. 10వ తరగతి మార్కులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెయిటేజ్, ప్రత్యేక రిజర్వేషన్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా రాష్ట్రంలో విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో శ్రీకాకుళం, నూజివీడు, ఇడుపుల పాయ, ఒంగోలు క్యాంపస్‌లను ఎంపిక చేసుకున్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి మహిళలకు 685, పురుషులకు 325, ప్రత్యేక కేటగిరీల్లో 100 మందికి ప్రవేశాలు కల్పించారు. మొత్తం 1100 సీట్లకు 1110 సీట్లు కేటాయించారు. 10 సీట్లు అదనంగా కేటాయించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 915, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు 95, తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు 12, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఒకటి, ఇతర ప్రత్యేక కేటగిరీలకు మిగిలిన సీట్లు కేటాయించారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఎస్ఎంపురం క్యాంపస్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. విద్యార్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి నూజివీడుకు 160 మంది, ఇడుపులపాయకు ఒకరు, ఒంగోలుకు 112, శ్రీకాకుళానికి 225 మంది ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఆర్‌జీయూకేటీ విద్యాసంస్థకు 498 మంది ఎంపికయ్యారు. 12.33 శాతం విద్యార్థులు ఎంపిక కాగా, 26 జిల్లాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు ఎక్కువ మంది ఎంపిక కావటం గమనార్హం.

'కళాశాలకు స్థల కేటాయింపు సరికాదు'



కళాశాల నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఫారెస్టు కార్యాలయం డివిజన్ శ్రీరాం విహార్ వద్ద ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలం కేటాయించడం సరికాదని గజపతి ఆదివాసీ మహా సంఘం అధ్యక్షుడు నిరోభయ్యాన్ అన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు గురువారం ఒక వినతిపత్రం అందజేశారు. గతేడాది ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీ స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆ స్థలంలో ఆదివాసీ సంగ్రహాలయం నిర్మిస్తామని ఐటీడీఏకు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా ఇప్పుడు కళాశాల నిర్మాణాలు చేపట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ఆదివాసీ మంత్రిని కలిసి సమస్యను వివరిస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఆదివాసీ మహా సంఘం కార్యదర్శి మోజేష్ దళ ఉన్నారు.

క్లుప్తంగా

2 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు

వీరఘట్టం: మండలంలోని అచ్చెపువలస వద్ద బుధవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో 2 టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు గురువారం తెలిపారు. సుమారు రూ.91 వేల విలువ గల బియ్యం, బొలెరో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా హిరాపంచమి



నరసింహునిగా భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

పార్వతీపురం టౌన్: జగత్తునేలే జగన్నాథుని రథోత్సవంలో భాగంగా గురువారం హిరాపంచమి వేడులకను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్వామి వారు నరసింహుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుండిచా మందిరంలోని మంటపంలో స్వామి వారిని దర్శంచుకునేందుకు బక్తులు బారులుదీరారు.

ప్రభుత్వ భూమి పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ హేమలత

పాచిపెంట: మండలంలోని మోసూరు గ్రామ సమీపంలో గల ప్రభుత్వ భూమిని ఆర్‌డీఓ హేమలత పరిశీలించారు. ఈ మేరకు గురువారం ఆమె మండలంలో పర్యటించారు. హరిత రహదారి వ్యర్థాలను డంప్ చేసే ఉద్దేశంతో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఏబీ రోడ్డులో దిగబడిన లారీలు

- ట్రాఫిక్‌కు అంతరాయం



గురండి వద్ద ఏబీ రోడ్డులో దిగబడిన రెండు లారీలు

భామిని: మండలంలో గురువారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మండలంలోని గురండి సెంటర్ వద్ద ఏబీ రోడ్డు గోతిలో బత్తిలి వైపు నుంచి వస్తున్న ఇసుక లోడుతో ఒడిశా లారీ దిగబడింది. అదే సమయంలో భామిని నుంచి బత్తిలి వస్తున్న లోడు లారీ రోడ్డులో దిగిన ఇసుక లారీని తప్పించుకుని వెళ్లే ప్రయత్నంలో రోడ్డు పక్కనున్న గోతిలో దిగబడింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఏబీ రోడ్డుపై రెండు వైపులా లారీల శ్రేణి, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. కొత్తూరు వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులు బిల్లుమడ నుంచి వెనక్కి తిప్పేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదే తరుణంలో కాట్రగడ-నేరడి బ్యారేజ్ మధ్య మరో ఇసుక లారీ ఏబిరోడ్డు గోతిలో దిగబడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేడు జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు తెలిపారు. ఈమేరకు మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో నిట్, ఐసీఐసీఐ బ్యాంక్, డెక్కన్ కెమికల్స్, ఏక్సిస్ బ్యాంక్, ఫాక్స్‌కాన్, ఆల్ స్టామ్, డైకి అల్యూమినియం ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డిక్సాన్, హ్యుండయ్, మోబీస్ అండ్ రాక్‌మెన్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. రిలేషన్‌షిప్ మేనేజర్, ట్రెనీ, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ టెక్నీషియన్, క్వాలిటీ, ప్రొడక్షన్ అండ్ మెయింటనెన్స్ విభాగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12వ తేదీ శుక్రవారం ఎస్‌వీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

ఎన్‌సీడీ క్లినిక్ మూసివేత..!

- వేరే చోట సిబ్బంది సర్దుబాటు
- అవస్థలు పడనున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు

విజయనగరం ఫోర్ట్: ఎన్‌డీఏ ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు ప్రస్తుతం చెబుతున్న మాటలకు పొంతన ఉండడం లేదు. అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం కంటే మెరుగైన వైద్యసేవలు అందిస్తామని నమ్మబలికింది. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పలురకాల వైద్య సేవలను రోగులకు అందకుండా దూరం చేస్తోంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగుల్లో బీపీ, షుగర్, కేన్సర్, గుండె జబ్బులు ఉన్నవారిని గుర్తించి చికిత్స అందించేందుకు ఎన్‌సీడీ క్లినిక్‌ను గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులు ఎన్‌సీడీ క్లినిక్‌కు వచ్చేవారు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు , స్క్రీనింగ్ చేసి అవసరమైన మందులు, చికిత్స అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్‌సీడీ క్లినిక్‌ను మూసివేసేందుకు సిద్ధమై ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

ఎన్‌సీడీ క్లినిక్‌లో విధుల్లో 9 మంది

ఎన్‌సీడీ క్లినిక్‌లో వైద్యాధికారి ఒకరు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, సైటో పెథాలజీ టెక్నీషియన్ ఒకరు, ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు, ఫిజియోథెరపిస్టు ఒకరు,



ఎన్‌సీడీ క్లినిక్

రిహ్యాబిలిటేషన్ వర్కర్ ఒకరు, ఆస్పత్రి అటెండెంట్ ఒకరు, శానిటరీ అటెండెంట్ ఒకరు పనిచేస్తున్నారు.

క్లినిక్ మూసివేతకు ఏర్పాట్లు

ఎన్‌సీడీ క్లినిక్‌ను మూసివేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగైదు రోజుల్లో ఈ ప్రక్రియను ముగించేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. ఎన్



క్లినిక్‌లో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు (ఫైల్)

సీడీ క్లినిక్‌లో పనిచేసే వైద్య సిబ్బందిని సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు.

అవస్థలు పడనున్న రోగులు:

ఎన్‌సీడీ క్లినిక్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు చికిత్స పొందేవారు. ఈ క్లినిక్‌లో పనిచేస్తున్న సిబ్బందిని ఇతర ఆస్పత్రులకు తరలించడం వల్ల సర్వజన ఆస్పత్రికి వచ్చే వారికి సేవలు అందవు.

వైద్యసిబ్బంది సర్దుబాటు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఎన్‌సీడీ క్లినిక్‌లో పనిచేసే సిబ్బందిని సీహెచ్‌సీలకు, ఏరియా ఆస్పత్రులకు తరలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీనిపై వారం రోజుల్లో చర్యలు తీసుకోనున్నాం.

డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎన్‌సీడీ విభాగం అధికారి

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరాష్కారానికి కృషి



ఆర్టీసీ డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ 73 వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న ఉద్యోగులు

- ఘనంగా ఈయూ 73వ ఆవిర్భావ దినోత్సవం

పార్వతీపురంటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరాష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఎంప్లాయిస్ యూనియన్ 73 వ ఆవిర్భావ దినోత్సవాన్ని సాలూరు ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పడిన ఏడుదశాబ్దాల కాలంలో సంస్థలో పనిచేసే ఉద్యోగుల హక్కుల రక్షణకోసం ఎన్నో ఉద్యమాలు చేసి సాధించామన్నారు. ఆర్టీసీలో మొట్టమొదటిగా సారిగా 1952 లోనే వేతనాల సవరణకు ఈయూ కృషి చేసిందని పేర్కొన్నారు. సుమారు మూడు దశాబ్దాల పాటు సింగిల్ యూనియన్‌గా కార్మికులకు ప్రాతినిధ్యం వహించింది ఈయూ అని అలాగే ప్రధానంగా ఆర్టీసీ ఉద్యోగుల అవసరాలకు ఆర్థికంగా ఉపయోగపడాలన్న ధ్యేయంతో 1952 లోనే క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటినుంచో ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల వాంఛ ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కూడా ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు కాలంలోనే సాధించుకున్నామని, విలీనం అనంతరం వస్తున్న ఇబ్బందులను పరిష్కరించేదిశగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

ఆర్టీసీ డిపోను పరిశీలించిన డిప్యూటీ సీటీఎం

సాలూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోను డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు పరిశీలించారు. గురువారం సాలూరు డిపోకు వచ్చిన ఆయన పార్శిల్స్ రవాణా తదితర అంశాలపై మాట్లాడి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏటీఎం దివ్య, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల పనుల పరిశీలన

పార్వతీపురం టౌన్: పార్వతీపురం జూనియర్ కళాశాల అదనపు భవనం పనులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు భవనం పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవనాలు త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. భవనాలు అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థులకు మరింత వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. మరుగుదొడ్లకు నిరంతరం నీటి సరఫరా జరిగేలా పర్యవేక్షణ ఉండాలని, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్ సౌకర్యం పరిశీలించాలని సూచించారు. విద్యా బోధనలో ఉత్తమ సాధనాలు వినియోగించాలని, విద్యా ప్రమాణాలలో ఎక్కడా లోపం



ప్రభుత్వ జూనియర్ కళాశాను పరిశీలిస్తున్న కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్

ఉండకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత భవన స్థలం వివరాలు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

- జూలై 15 నుంచి కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష
- కేవీపీఎస్ హెచ్చరిక

పార్వతీపురం: గరుగుబిల్లి మండలం శివ్వాం దళితుల భూ సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణ మూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనంలో వివిధ ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా నాయకుడు వై.మన్మథరావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు శివ్వాం గ్రామ దళితులకు 1970లో 22.80 ఎకరాలు భూమిని డీపట్టాల రూపంలో మంజూరు చేయగా దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. దళితులు సాగు చేసుకుంటున్న భూమిపై తప్పుడు సర్వే నంబర్లతో రైతులు కోర్టు ఇంజక్షన్ ఆర్డరు తెచ్చి దళితుల భూమిని లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు పెత్తందారుల



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా నాయకుడు మన్మథరావు

వైపే ఉంటూ దళితులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సాగు చేసుకుంటున్న దళితులపై దాడిచేసినప్పటికీ పెత్తందారులపై కేసు నమోదు చేయడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. సమస్యను పరిష్కరించకపోతే జూలై 15 నుంచి 29 వరకు కలెక్టర్ కార్యాలయం దగ్గర రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సీపీఐఎంఎల్ లిబరేషన్ సంఘం నాయకులు జి.జనార్దన రావు, ఐద్వా నాయకురాలు రెడ్డి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి



బాలుడి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు



నవదీప్ (ఫైల్)

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం ఎస్సీకాలనీకి చెందిన మూడేళ్ల బాలుడు గొల్ల నవదీప్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. గురువారం ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల మేరకు రోజూలాగానే ఎప్పటిలాగే అంగన్వాడీకి వెళ్లిన నవదీప్‌ను మధ్యాహ్నం భోజనం అనంతరం టీచర్ ఇంటి దగ్గర అప్పగించి వెళ్లిపోయింది. కొద్ది సమయం తరువాత తోటి పిల్లలతో చెరువు దగ్గర లోని సిర్లిపోతన్న గుడివద్దకు ఆడుకునేందుకు బాలుడు వెళ్లాడు. అక్కడ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. వెంటనే గమనించిన తోటి చిన్నారులు బాలుడి కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకుని బాలుడిని బయటకు తీసి సపర్యలు చేశారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు తవుడు, నాగమణిలతోపాటు కుటుంబసభ్యులు భోరున విలపించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సన్యాసి మృతదేహం

బొబ్బిలి: పట్టణంలోని మహరాణి పేటకు చెందిన పత్తిరి సన్యాసి (45) పశువులను మేపడానికి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ ఎం.నాగేశ్వర రావు సిబ్బందిని పంపించి దర్యాప్తు చేపట్టారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారించినట్టు సీఐ చెప్పారు. ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిక్షణం అండగా ఉంటాం

- ప్రజావాణి వినిపిస్తాం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు
- బొబ్బిలిలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

బొబ్బిలి:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు చేసిన సంక్షేమం, విద్య, వైద్యంలో గుర్తుండిపోయేలా చేసిన సంస్కరణలు గడిచిన ఎన్నికల్లో మంచి ఫలితాలను ఇవ్వలేదని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఎన్నికల ఫలితాలకు ఓ నిర్దిష్టమైన అంచనాలుండేవని, నేటి ఫలితాలను విశ్లేషణ చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో ప్రజలు కోరుకుంటున్న అంశాలనే అజెండాగా మేనిఫెస్టోలో పెట్టి అమలు చేశారని, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎంతో కష్టపడ్డారన్నారు. మీరంతా వారి గెలుపు మళ్లీ చూడాలని అహర్నిశలూ శ్రమించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కొత్త ప్రభుత్వం వచ్చింది. వారు ప్రకటించిన మేనిఫెస్టో అమలు కోసం రాష్ట్రస్థాయిలో పార్టీ ఇచ్చే కార్యాచరణ ప్రకారం నడుచుకుందామని పిలుపునిచ్చారు. మీకు ఏ ఇబ్బందులూ రాకుండా ప్రతిక్షణం అండగా, అందుబాటులో ఉంటామని భరోసా కల్పించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఎవ్వరూ అధైర్యపడొద్దని, నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దని అనునయించారు. అమలు కాని హామీలకు ప్రజలు మద్దతు పలుకుతారనుకోలేదని ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఓటమిని తప్పించుకోవడానికి నైతిక విలువలు కోల్పోలేమన్న జగన్ మోహన్ రెడ్డి అబద్ధాలతో మేనిఫెస్టోను నింపలేమని ఎంతోమంది వద్ద కుండబద్దలు కొట్టారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలో విద్య, వైద్యం, సంక్షేమ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పరిపాలనలో ఎవరికీ అన్యాయం చేయలేదన్నారు. అందరం తరచూ కలుద్దామని, అందరికీ అందుబాటులో ఉంటామని పునరుద్ఘాటించారు.

మీ కష్టాలు..కన్నీళ్లలో తోడుంటాం

వైఎస్సార్‌సీపీ ఎంపీగా తనను గెలిపించేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తోడ్పాటునందించిన మీ అందరికీ కృతజ్ఞతలని, మీ కష్టాలు, కన్నీళ్లలో అనునిత్యం తోడుంటామని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పార్టీని ముందుకు తీసుకువెళ్లి మళ్లీ మన సత్తా చూపుదామని ఆందోళన చెందవద్దన్నారు. అభివృద్ధి పనులు, సాగునీరు, తాగునీరు, ఎన్నో సంక్షేమపథకాలను అందించడంతో పాటు మహిళలకు ప్రత్యేక పథకాలతో సుపరిపాలన అందించినప్పటికీ.. మంచి మందు ఇస్తాం అన్నవారికే ఓటేసినట్లయిందన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి నెలరోజులైనప్పటికీ నేటికీ హామీల్లోని ప్రధానాంశాలైన తల్లికి వందనం, రైతు భరోసాలు లబ్ధిదారులకు అందలేదన్నారు. మరికొన్నాళ్లు వేచి చూసి ప్రజల తరపున పోరాడతామని స్పష్టం చేశారు. రేషన్ డీలర్లు, తదితరులను తొలగించే కుట్రలు చేస్తున్న టీడీపీ ప్రభుత్వం చివరకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలను సైతం కూలదోస్తూ అరాచకాలకు దిగుతోందని ధ్వజమెత్తారు. ఇలాంటి దారుణాలపై న్యాయ పోరాటాలు చేసి అందరికీ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మాజీ సీఎం , మాజీమంత్రి జగన్ మోహన్ రెడ్డి, బొత్స సత్యనారాయణల సూచనల మేరకు పార్టీని బలోపేతం చేసుకుందామని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

మనో ధైర్యంతో ఉంటేనే భవిష్యత్తు

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, నాయకులు, కార్యకర్తలు మనో ధైర్యంతో ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఐదేళ్లలో నభూతో నభవిష్యత్ అన్న విధంగా సంక్షేమాన్ని వండి వార్చినప్పటికీ ఓటమి కలిగిందంటే కారణాలు తెలుసుకోవాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో ఆ ఓటమికి కారణాలు తెలుస్తాయని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, పార్వతీపురం పరిశీలకుడు తూముల భాస్కర రావు, నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాల నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాల రావు, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, కార్యర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- మంత్రి సంధ్యారాణి

సాలూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహించాలని స్త్రీ శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె సాలూరు పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో పారిశుద్ధ్య వారోత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 16 నుంచి వచ్చే నెల 2 వరకు ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారని, వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీఓ బలివాడ సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య వారోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి


ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలో మంత్రి

పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ మేరకు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని చినబజార్ వద్ద ఆహార, పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేయనున్న రైతు బజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాన్ని మంత్రి ప్రారంభించారు.కార్యక్రమాల్లో డీఆర్ఓ కేశవనాయుడు, ఆర్‌డీఓ హేమలత , డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీకి 920 గ్రాములేనట..!

- సర్కారు వారి తూకంలో తేడా
- ఎమ్మెల్యే, జేసీ సమక్షంలో తూకం తగ్గినా చర్యలు శూన్యం
- రైతుబజార్‌లో రూ.160కే కందిపప్పు విక్రయం ప్రారంభం

విజయనగరం ఫోర్ట్: చదువుకున్న వారైనా? చదువురాని వారికైనా సాధారణం ఒక కేజీకి 1000 గ్రాములు అన్న విషయం తెలుసు. ఈ నేపథ్యంలో తూకాల్లో మోసాలకు పాల్పడే వారికి అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వమే వినియోగారులను మోసం చేస్తోంది. ఈ తరహా సంఘటన దాసన్న పేట రైతు బజారులో గురువారం జరిగింది. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ కోసం తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం విక్రయాలను రైతు బజార్లలో



920 గ్రాములు వచ్చిన కందిపప్పు ప్యాకెట్

ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం చెప్పింది. ఈ మేరకు అర్భాటంగా మార్కెట్‌లో కందిపప్పు రూ.181 ఉంటే రైతు బజార్లలో రూ.160కి, బియ్యం స్టీమ్డ్ (సోనామసూరి) కేజీ రూ.55.85 ఉంటే రూ. 49కి బియ్యం విక్రయ స్టాల్‌ను దాసన్న పేట రైతు బజార్‌లో విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతి



920 గ్రాములున్న ప్యాకెట్‌లో అదనంగా 80 గ్రాములు వేస్తున్న దృశ్యం

రాజు, జాయింట్ కలెక్టర్ కార్తీక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినియోగదారుడికి అందించేందుకు కందిపప్పు ప్యాకెట్‌ను తూకం వేయగా 920 గ్రాములు వచ్చింది. మరో నాలుగు ప్యాకెట్లు తూకం వేయగా అవి కూడా 920 గ్రాములు వచ్చాయి. దీంతో అవాక్కయిన అధికారులు 920 గ్రాముల ప్యాకెట్‌లో అదనంగా 80 గ్రాములు వేసి కేజీ కంది పప్పును అందించారు. ఆ తర్వాత 920 గ్రాములు ఉన్న కంది పప్పు ప్యాకెట్లను రూ.160కి విక్రయించారు. ఎమ్మెల్యే, జేసీ సమయంలో కంది పప్పు తూకం తక్కువగా వచ్చినప్పటికీ అక్కడ సిబ్బందిని ఏమీ అనకపోవడంతో అక్కడికి వచ్చిన వారంతా ఆశ్చర్యపోయారు. అధికారులకు తెలిసే ప్యాకింగ్ తక్కువగా చేసి ఉంటారనే గుసగుసలు వినిపించాయి.



కందిపప్పును వినియోగదారుడికి అందిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జేసీ కార్తీక్